# ప్రేమగీతం

కన్నేపల్లి చలమయ్యశాస్త్రి

ఒప్పుకుంటాను.

పెళ్ళికి ముందు నే నో తిరుగుబోతుని.

ఆ మాటకొ స్తే, మగాళ్ళలో తొంభైశాతం నాలానే తిరుగుబోతు లనుకుంటాను. నా గురించి గొప్పగా చెప్పుకోవడం కాదు గానీ, సామన్య జనంకన్నా నేను చాలా అందమైన వాణ్ణి. తెలివితేటలు కూడా ఎబౌ ఏవరేజి. కాస్తో కూస్తో సంగీతంలోనూ, సాహిత్యంలోనూ ప్రవేశముండడం అదనపు క్వాలిఫికేషన్.

వీటన్నిటికీ మించి నా మాటకారితనం నన్నే ఆశ్చర్యపరుస్తుంది. ఇన్ని సుగుణాలున్న నన్ను ఏ అమ్మాయైనా ఎలా ప్రేమించకుండా తప్పించుకోగలదు? అదీ నేను ఎలిజిబుల్ బేచిలర్ నైనప్పుడు.

నా ఆత్మవిశ్వాసాన్ని బలపర్చుకోవడానికంటూ నేను అందమైన అమ్మాయిలపై వలలు విసురుతుండేవాణ్ణి. వి "సరిన వల లెప్పుడూ వృథా పోలేదు. మత్స్య కన్యల్లా ఠక్కున వలలో పడేవారు.



ఈ దశలో లెఖ్ఖ వేసుకుందామంటే కుదరని పనిగానీ, అటు ఇటుగా కనీసం పాతికమంది అమ్మాయిల్తో ప్రేమగీతాలు ఆలాపించినట్టు గుర్తు. ఇవన్నీ ఎంతవరకూ? నిరుడు వేసవిలో నా పెళ్ళి కానంతవరకూ.

నాకు పెళ్ళిపట్ల, దాంపత్య జీవనంపట్ల కొన్ని అభిప్రాయా లున్నాయి. కొన్ని నిర్ణయాలకు కట్టుబడ్డ మనిషిని నేను.

పెళ్ళి కాకమునుపు ఎన్ని వేషాలు వేసినా ఫర్వాలేదు గానీ, పెళ్ళయి మరో వ్యక్తితో జీవితం పంచుకుంటున్నప్పుడు ఇద్దరిలోనూ అరమరిక లుండకూడదనీ, ఒకరినొకరు ఛాయామాత్రంగా నైనా మోసం చేసుకోకూడదనీ నా అభిమతం.

తదనుగుణంగా కుర్రతనానికి పెళ్ళితోనే స్వస్తి పలికేను.

భార్గవిని నా జీవితంలోకి మనఃస్ఫూర్తిగా ఆహ్వానించేను. పెద్దల అనుమతితో మాఇద్దరి జీవితాలు ముడివేసుకున్నాయి.

అనురాగ దాంపత్యాన్ని పండించుకుంటున్నాం.

నా గతం గురించి మొదటి రాత్రే భార్గవికి తెలియపరిచేను చూచాయగా.


"అవన్నీ కుర్రతనపు చేష్టలు. వాటి గురించి నేనేం సిగ్గుపడ్డంలేదు గానీ, అలాటి పొరపాట్లు మళ్ళీ దొర్లవని మాత్రం హామీ ఇస్తున్నాను."


బదులుగా భార్గవి నవ్వింది కనీకన్పడనట్టు. అది మొదటి రాత్రి తెచ్చిన సిగ్గో, అభిజాత్యమో అర్థం కాలేదు.

ఇలాటి విషయాలు మరొకరి నోట వినేకన్నా స్వయంగా చెప్తే మరే అపోహలు చోటు చేసుకోవన్న నమ్మకం నాది.

ఈ సంగతి విని అందరి ఆడాళ్ళలా భార్గవి కన్నీళ్ళు పెట్టుకున్నా, ఇలా చేసినందుకు నిలదీసినా ఏం చేసేవాడినో తెలీదుగానీ, భార్గవి చిర్నవ్వు ఆమె నన్ను అర్థం చేసుకుందన్న ఓదార్పు నిచ్చింది.

రోజులన్నీ అలానే గడిచిపోతే ఇప్పుడీ కథ రాసుకునే అవసరముండేది కాదు. కానుకో






లేం గాని, ఈ ఆడవాళ్ళు అణగారిన అగ్నిభాండాలు. ఏ ఋతుపవనానికో ఒక్కసారి భగ్గున ప్రజ్వరిల్లుతారు.

భార్గవి శతకోటి ఆడవాళ్ళలో తనూ ఒకతె.

×× ×× ××

మా తమ్ముడి పెళ్ళికని విశాఖపట్నం వెళ్ళాం ఈ వేసవిలో.

పెళ్ళికి మా బంధుబలగమంతా ఎప్పటిలానే హాజరయ్యేరు.

ఇక్కడ మా బంధువుల గురించి రెండు మాటలు చెప్పాలి. మావాళ్ళు అందరిలాంటి వాళ్ళు కారు. కృతకమవుతున్న జీవన ప్రమాణాలు మా అభిమానాలని దెబ్బ తీయలేదు. కష్టాల్లో,కన్నీళ్ళలో, సుఖాలలో,కేరింతలలో ఒకేలా అన్నిటిలోనూ పాలుపంచుకుంటారు.

నా చిన్నప్పుడు నాకు లీలగా గుర్తున్న మా చిన్న మేనత్త పెళ్ళికి ఎంతమంది హాజరయ్యేరో, ఇప్పుడు—పాతికేళ్ళ తర్వాత మా తమ్ముడి పెండ్లికీ ఎక్కడెక్కడి వారూ అలానే వచ్చేరు. వీళ్ళంతా జీవన పోరాటంలో చెల్లా చెదరయిన వాళ్ళే.

అందర్నీ చూస్తుంటే ప్రేమతో నా హృదయం పొంగిపోతుంది. ఆప్యాయతతో నిలువెల్లా పులకరిస్తుంది. పరస్పర విచిత్ర స్పందనకు లోనవుతూ కష్టసుఖాలను ఏకరువు పెట్టుకుంటాం.

అయితే, నేను విసిరిన వలలో మునుపు చిక్కుకున్న ఇద్దరు బంధువు లమ్మాయిలు (ప్రస్తుతం పిల్లల తల్లులే) వచ్చేరు.

నాతో అప్పటిలానే చనువుగా మాట్లాడ్డం, పరాచికాలాడ్డం తగ్గలేదు. అప్పటికీ, ఇప్పటికీ స్థితిలోనే తేడా.

భార్గవిని మెచ్చుకోలుగా చూస్తూ చురక అంటించేరు. "ఇగో,చెల్లెలా—మీ ఆయన క్రిష్ణావతారం సుమీ! మా అందర్నీ గోపికల్లా ఆడించి మొత్తానికి రుక్మిణికే చిక్కిపోయాడు. పెళ్ళయి సంవత్సరం దాటిపోయింది కాబట్టి, మళ్ళీ అవతార మెత్తుతాడేమో కానుకో..."

భార్గవి వాళ్ళకి సరిగ్గానే బదులు చెప్పింది-"పెళ్ళయింది కదండీ—పూర్తిగా రామావతారమే. అప్పుడంటే ఆయన ఏ గాలికైనా ఎగిరిపోయే చిత్తు కాగితంలా ఉండేవారు. ఇప్పుడు పేపర్ వెయిట్‌లా నే నెగరనిస్తే కదా!"

"అమ్మో-అందానికే కాదు, మాటకారివి కూడానా! ఉండతగిన దానివే. అయినా మగాళ్ళు మగాళ్ళే సుమీ..." హెచ్చరించేరు.

భార్గవికి నా మీదున్న నమ్మకానికి నే నెంతో సంతోషించేను.

నేను కోరుకున్నది కూడా ముమ్మాటికి ఇదే. ఎవరు నా గురించి చెడుగా చెప్పినా నా భార్య నమ్మకూడదు. గతాన్ని తరచి వర్తమానాన్ని అల్లకల్లోలం చేయకూడదు.

కానీ, నా సంతోషం చెదిరిపోవడానికి మరో పూటకన్నా ఎక్కువ పట్టలేదు. తమ్ముడి పెళ్ళయ్యేకా, ఎన్నాళ్ళబట్టో అనుకుంటున్న సింహాచలం ప్రయాణం పెట్టుకున్నాం భార్గవీ, నేనూ.

సింహాచలం కొండమీద, ఆకాశగంగ చప్టామీద భార్గవి పిడుగుల వర్షం కురిపించింది.

మొదటిసారిగా ఆమె కళ్ళలో నా పట్ల అసహ్యాన్ని గుర్తించి కొద్దిగా భయపడ్డాను. నా ఫీరీ, నమ్మకం ఇలా మట్టిగొట్టుకు పోయినందుకు కసి రేగింది.

"డోంట్ బి సిల్లీ—ఇంత చిన్న విషయాన్ని కెందు కింత రాద్ధాంతం చేస్తావ్? ఇవన్నీ నీకు చెప్పకుండా దాచి ఉంటే అది వేరే విషయం. మొదటి రోజే అన్నీ నీకు తెలియ చెప్పేను. స్పోర్టివ్‌గా తీసుకోవాలి గానీ, ఇంత సీన్ క్రియేట్ చేయడం మంచిదా?"

భార్గవి రుసరుసలు తగ్గలేదు.

మొహం ఎర్రబారగా, కళ్ళలో నిప్పులు కురిపిస్తూ అంది- "చేసిన తప్పునే మళ్ళీ చేయరన్న గ్యారంటీ ఏమిటి? వాళ్ళకెటూ సిగ్గు లేదు- ఇద్దరేసి పిల్లల్ని కనీ తగుదునమ్మా అంటూ ఇంకా పరాచికా లేమిటి? మీ జ్ఞాన మేమయింది? చెరిగి పోవడాని కవేం పెన్సిల్ గీతలా—ప్రేమగీతాలు. వాళ్ళతో మాట్లాడేటప్పుడు మీ మన సెంత సుళ్ళు తిరిగిందో, మీ కనుల్లో ఎంత మెరుపు మెరిసిందో గమనించలే దనుకున్నారా!"

"నన్ను తప్పుగా అర్థం చేసుకోకు,భార్గవీ ఆ వయస్సులో విచ్చలవిడితనంలో వేసిన తప్పటడుగులు మళ్ళీ వేస్తాననుకోకు. సంవత్సరమై కలిసి కాపురం చేస్తున్నాం. ఇంతేనా న న్నర్థం చేసుకున్నది?" అన్నాను సాధ్యమైనంత బరువు ధ్వనింపచేస్తూ.

ఈ డైలాగ్ నా కెంతో నచ్చింది. భార్గవి రాజీ పడుతుం దనుకున్నాను.

కానీ భార్గవి—భార్గవే.

ప్రజ్వరిల్లుతున్న అగ్నిభాండం.

"ఈ మాయ కబుర్లు మరెవరికైనా చెప్పండి. ఈ సంవత్సరమూ మీ అసలు రంగు బయటపడే అవకాశమిస్తే కదా! కోకిల ఎప్పుడు కూస్తుంది?మావి చివురు తొడిగినప్పుడే కదా! మిగిలిన రోజుల్లో అదేం చేస్తుందో, ఎక్కడుంటుందో ఎవరికి పట్టుంది? ఇదిగో వసంతం వచ్చింది—నేనూ వచ్చానంటూ బయటి కొస్తుంది. మీ వసంతం ఇప్పుడేగా బయట పడింది."

అమ్మమ్మ! మాటల్లో ఈమె నోడించడం నా తరం గాదు.

లాయర్ కూతు ర్ననిపించుకుంది.

అందుచేత ఆఖరి అస్త్రంగా ఆమె రెండు చేతులూ నా చేతుల్లోకి తీసుకున్నాను. రాని కన్నీటిని రప్పించుకుంటూ, "పోనీ జరిగిన దంతా పీడ కలగా మర్చిపో. ఆ సింహాద్రి అప్పన్న సాక్షిగా చెపుతున్నాను. నేను మ రే అమ్మాయినీ నా మనస్సులోకి రానీయను. పాత పరిచయస్థు లెదురైనా రిజర్వ్‌డ్‌గా ఉంటానునరేనా..." అన్నాను.

నా బిక్కమొహం చూసి భార్గవి విజృంభణ తగ్గింది.

అంతలోనే ఆమె మొహం ప్రసన్నంగా మారిపోయింది.

'బ్రతుకుజీవుడా' అనుకొని కొండ దిగేను. దిగుతూ, దిగుతూ మనస్సులోనే తర్కించుకున్నాను 'గతాన్ని ఈమెకు చెప్పి తిరుగులేని పొరపాటు చే సేనేమో'నని.

కానీ ఇదేమిటి, పెళ్ళామే బ్లాక్‌మెయిలరై కూచుంటే ప్రపంచంలో మొగుళ్ళ గతేంగాను?

ఈ పూర్ క్రీచర్ న న్నింత కంట్రోల్ చేయగలుగుతోందంటే, నా మీద ఇంత కమాండ్ చెలాయిస్తోందంటే—నే నెన్ని మెట్లు దిగజారినట్టు?

సమయం చూసి భార్గవికి బుద్ధి చెప్పాలి.

×× ×× ××

మామాఘగారిది ఆంధ్రదేశంలో అందమైన

పట్టణం.

ఆ పట్టణాన్ని 'రెండో మద్రాస్'గా వ్యవహరించడం కద్దు.

సినిమా హాల్సన్నీ కొలువుతీరినట్టు ఒకే వీథిలో ఉండడమూ ప్రత్యేకతే.

మామగారు పట్టణంలో పేరు పొందిన సివిల్ లాయరు.

అందుచేత అందమైన పట్టణంలో, మర్యాదస్థుల కాలనీలో మామగారిది రెండంతస్తుల మేడ.

తమ్ముడి పెళ్ళయ్యేకా అట్నుండి తిన్నగా మామగారింటికే మా ప్రయాణం.

తూర్పు సముద్రం చల్లగాలిని మోసుకొస్తూ వేసవి ఉద్ధృతాన్ని తగ్గిస్తోంది.

రిక్షా దిగి, గేటు తెరుచుకుని, పూలమొక్కలగుండా మెయిన్ హాల్లోకి చేరుకున్న మమ్మల్ని క్లయింట్ల మధ్యనుండి నిశితంగా పరికించి తలాడించేరు మామగారు.

మామగారు అజానుబాహువు. ఆరడుగుల పైన పొడగరి.

పొడుక్కి తగ్గ వెడల్పు— ఈ రెండింటికీ సరిపోయిన డీసెల్ ఇంజన్ లాంటి గొంతు మామగారి ప్రత్యేకత.

'నోరు పెట్టుకుని బ్రతుకరా, నాయనా' అని వాళ్ళ మామ్మ చిన్నప్పుడు దీవించేదట. నిజాన్కి ఆ నోరే మామగారిని లీడింగ్ లాయర్ని చేసి పారేసింది.

ఎదుటి లాయర్‌కి ఎంత న్యాయశాస్త్ర పరిజ్ఞానమున్నా, మామగారి నోటి ధాటికి అన్ని ఆర్గ్యుమెంట్లూ గాలి కెగిరిపోయేవట.

మామగారు కోర్టులో వాదిస్తుంటే మయసభలో దుర్యోధనుడిలా మేజిస్ట్రేటుగార్కి ముచ్చట కొలిపేవారట. అందుచేత, అవతలి లాయర్ వాదనలో లీగల్ పాయింట్లు వొదిలేసి మామగారికే ఫ్లాస్ పాయింట్ ఇచ్చి కేసు గెలిపించేవారట.


మరో ముఖ్యమైన సంగతి—మామగార్కి వేషం కడితే రావణాసురుడిలానూ, కట్టకపోతే రావు గోపాల్రావులానూ కన్పడతారు.

ఆయన చూపు సూటిగా, గుచ్చుకున్నట్టుగా ఉంటుంది. క్లయింట్లనూ, స్నేహితులనూ, బంధువులనూ అలానే పొడిచినట్టు చూస్తా రాయన.

ఆ చూపుని తప్పించుకుంటూ మేడమీదికి భార్గవి గదిలోనికి నడిచేం. గదిలో విశ్రాంతి తీసుకుంటున్న రెండు నిముషాలకే గదిలో వసంతశోభ వెల్లివిరిసింది.

పాత రోజులు చటుక్కున గుర్తుకొచ్చి, పక్కనే భార్గవి ఉందన్న విషయం జ్ఞప్తికి రాగానే చప్పున చల్లారిపోయేయి.

రావి శాస్త్రిగారి వియత్నాం విమలలా అయిదున్నర అడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ శరీర పటుత్వంతో, వెన్న తిన్న పావురంలా, నడిచే పసిడిబొమ్మలా గదిలోనికి వచ్చిందొకామె చేతుల్లో కాఫీ కప్పుల్తో.




మగాళ్ళని చూస్తేనే పాపం అంటుకుంటుం దన్నట్టు కప్పుల్ని టీపాయ్‌మీద ఉంచి బయటికి నడిచింది.

నడుస్తూ ఒక్క క్షణం వెనక్కి తిరిగి, "అమ్మలూ—బాత్రూమ్‌లో వేణ్ణీళ్ళు పెట్టిస్తాను. స్నానం చేస్తారేమో..." అనేసి వెళ్ళిపోయింది.

ఆమె సౌందర్యంలానే గొంతు అద్భుతం. మావి చిగురు తిని మత్తుగా కూసే కోయిలలా ధ్వనించింది.

ఆమె అటు నడవగానే గదిలో మళ్ళీ చీకటి క్రమ్ముకుంది.

ఆమధ్య సంక్రాంతి పండక్కి వచ్చినప్పుడు ఈ మెరుపుతీగె ఏమయిందో? తెలుగు సినిమాలు చూడలేక, ముసలి వంటలక్క చేతి పిండి వంటలు తినలేక, మామగారి సుత్తి భరించలేక కనుము మర్నాడే ప్రయాణం కట్టించేను.

అప్పట్లో ఈ సాలభంజిక దర్శనమిచ్చి ఉంటే సెలవు పొడిగించే వాడినే.

భార్గవి నన్ను అబ్జర్వ్ చేస్తుందేమోనన్న భయాన్ని కోరిక డామినేట్ చేయగా,ఆమె కదలికల్లో అందాన్ని దొంగతనంగా ఆస్వాదించేను.

ఆమె స్థాన మేమిటో అర్థమయింది—కొత్త వంటలక్క.

భార్గవి చిన్నతనంలోనే అత్తగారు కాలం చేసేరట. వయస్సు చెల్లకపోయినా మామగారు మళ్ళీ పెళ్ళి మాట తలపెట్టలేదు.

పెద్ద బావమరది శ్రీనివాస కాండ్లాలో నేవీ ఇంజనీరు. సంవత్సరాని కోసారి నెల రోజుల సెలవుమీద వచ్చి వెళ్ళిపోతుంటాడు. పెళ్ళి చేసుకునే వయస్సైతే వచ్చిందిగానీ 'ఎందుకీ బాదరేషన్' అంటూ వాయిదా వేస్తుంటాడు.

వంటలక్కల సాయంతోనే ఇల్లు గట్టెక్కిస్తున్నారు మామగారు.

అందమైన వంటలక్కల్ని ఇంట్లో పెట్టుకున్న పెద్దమనుషులంటే సదభిప్రాయం లేదు నాకు. అదో రకం దోపిడీగా భావిస్తాను.

నేను ప్రిమిటివ్ కమ్యూనిస్టునేమో నాకే తెలీదు.

×× ×× ××

అపరాత్రి అకస్మాత్తుగా తెలివి వచ్చింది.

భార్గవి అస్తవ్యస్తంగా పడుకుంది -చిన్నపిల్లలా.

లేచి సిగరెట్ వెలిగించుకున్నాను. కిటికీలోంచి వెన్నెల చారలు గదిలోకి ప్రసరిస్తున్నాయి.

పల్చని వెన్నెలతోపాటు చల్లని గాలి మనోహరంగా చక్కిలిగింతలు పెడ్తోంది. ఏ అదృశ్య నాట్యాన్నో చూస్తూ మైమర్చినట్టు తలలాడిస్తున్న కొబ్బరి చెట్లు. వాటి రెమ్మల మధ్య నుండి వరండామీదికి ప్రాకుతున్న వెన్నెల సోన.

ప్రకృతి సోయగాల్లో కృష్ణశాస్త్రి, రాయప్రోలు సాక్షాత్కరించేరు.

వెన్నెల్లో తడిసిన మంచుపువ్వులా మనసు భావుకత్వంలో పడింది. అలా ఎంత సేపు కరిగిపోయానో తెలీదు.

ఇంతలో—

సన్నని ఎక్కిళ్ళు విన్పించేయి.

సిగరెట్ చివరివరకూ కాలి చురుక్కుమనిపించింది.


నిశ్శబ్దంగా ఉందేమో, ఎక్కిళ్ళు స్పష్టంగా విన్పిస్తున్నాయి. వాటి వెనుక గుసగుస లాడుతున్నట్టు మగగొంతు.


ఉత్సుకత నాపుకోలేకా, శబ్దం రాకుండా తలుపు తెరిచేను.

వరండాలో మెట్ల ప్రక్కగది మామగారిది.

మామగారింకా నిద్రపోలేదని స్పష్టం చేస్తూ తలుపు తెరిచే ఉంది. గదిలోంచి వరండామీదికి లైటు వెలుగు పడ్తోంది.

వరండాలోకి మెల్లగా నడిచేను.




ఇందాక విన్న ఏడుపు నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. ఈ ఇంట్లో అర్ధరాత్రివేళ జరగకూడని దేదో జరుగుతోం దనిపించింది.

నిద్రమత్తు పూర్తిగా వదిలే సింది. ఏదో రహస్యాన్ని కనిపెట్టనున్న ఉత్సాహంతో గుండె గుబగుబలాడింది.

మాకుగారి గదిలోనికి చూ సేను.

గదిలో ఆయన లేరు—నా అనుమానం రూపం దాలుస్తోంది.

చప్పుడు కాకుండా దొంగలా మెట్లు దిగేను.

మెట్ల ప్రక్కన, మాకుగారి గది దిగువ—ఆమె గది.

ఆ గదిలోంచే ఇందాకటి ఏడుపు వినవచ్చింది.

ఆ గది తలుపులు తెరిచే ఉన్నాయి. దీపం నీరసంగా వెలుగుతోంది.

మాకుగారి బొంగురు గొంతు స్పష్టంగా వినవస్తోంది.

"నీకు అన్యాయం జరక్కుండా చూ సే బాధ్యత నాది. ఎవరేమనుకుంటారోనన్న భయాన్నికూడా లెక్క చేయక ని న్నీ ఇంటికి తెచ్చినప్పుడే నే నో నిర్ణయానికొచ్చాను. ఇంత కాలమూ ఓపిక పట్టావు. మరో నెల్రోజులు ఆగలేవా?" అర్థిస్తున్నా రాయన.

ఆమె ఏదో చెప్పింది- సన్నగా, అస్పష్టంగా.

బదులుగా మాకుగారి గొంతుకే వినిపించింది. "తొందరపడి ఏ ప్రయోజనమూ లేదు. నువ్విలా రాత్రింబవళ్ళు ఏడుస్తూ కూచుంటే నీ ఆరోగ్యం దెబ్బతింటుంది. అంతకుమించి నీ గర్భంలో ప్రాణం పోసుకున్న శిశువు..."

మరిక విననవసరం లేదనిపించింది. మిగిలిన కథని ఊహించుకోగలను నేను.

ఇలాటి విషయాలు తెలియకుంటేనే మంచిది.

సిగ్గుతో శరీరం చితికిపోయింది. జరుగుతున్న దొంగాటకాన్ని ఊహించుకుంటుంటే అసహ్యం కలుగుతూంది.

చప్పుడు కాకుండా గదిలోకి చేరుకున్నాను.

భార్గవి అలానే పడుకుంది. నిద్రలో ఎందుకో సన్నగా నవ్వుతూంది.

మరో సిగరెట్ వెలిగించాను, తలుపులు గడియ పెట్టి.

ఇందాకట్లానే వెన్నెల... అలానే పిల్లగాలి!

అయినా రాయప్రోలు, కృష్ణశాస్త్రి కనుమరుగయ్యారు.

అనిర్వచనీయమైన దిగులు.

గుండెలో సుళ్ళు తిరుగుతూ అవ్యక్తమైన ఆవేదన.

ఏడుస్తున్న ఆమె రూపమే కనులముందు తిరుగుతూ ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

ఈ కథలో ఏ పాత్ర లేని నేను ఎందు కింత నలిగి పోతున్నాను?

ఆలోచనలమధ్య కలతనిద్దుర కౌగిలిలో ఒదిగిపోయాను.

××× ××

రోజంతా అదే అసహనం.

నిన్న రాత్రి జరిగిందంతా కలగా మిగిలి ఉంటే బాగుణ్ణు.

నిన్నటివరకూ ఆమెను చూ స్తే ఏదో జంకు... కానీ ఈరోజు?

మాకుగారినిచూస్తున్నా అదే ఏహ్యత.

సభ్యత,సంస్కారం విస్మరించి,వయోభేదాలు పాటించక, కేవలం శారీరక అవసరాలకె నం చీకటి బ్రతుకు కోరుకుంటున్న ఆ ఇద్దర్నీ అలానే కాల్చిపారేయా లనిపించే క సి.

భార్గవి కీ విషయం తెలి స్తే?

చీకటి కథలంటే అసహ్యం ఆమెకు.

ఈ విషయంలో తండ్రైనా, దేవుడైనా ఒకటే.

ఇంతవరకూ తండ్రి పట్ల గూడు కట్టుకున్న గౌరవం ఈ దెబ్బతో తుడుచుకు పోతుంది.

నిన్న కాదు మొన్న- ఏమీ లేనిదానికి ఎంత రాద్ధాంతం చే సింది సింహాచలంలో!

ఆమెముందు తప్పు చే సిన వాడిలా తల దించుకోవాల్సి వచ్చింది నేను.

ప్రపంచంలో తమ భర్తలు తప్పించి, మిగిలిన మగవారంతా శీలసత్పురుషులనుకునే కోట్లాది ఆడకూతుళ్ళకి భార్గవి ప్రతీక.

ఈ విషయం భార్గవికి తెలియజేయడమా మానడమాఅనే సందిగ్ధంలో పడ్డాను కొంత సేపు.

చివరికి ఆమెకు తెలియజే స్తేనే మంచిదన్న నిర్ణయానికి వచ్చేక బరువు దింపుకున్నట్టయింది. భార్గవికి బుద్ధి చెప్పినట్టూ అవుతుంది.


రాత్రి భార్గవిని నిద్ర పోనీయలేదు.

నాకూ నిద్ర ముంచుకొస్తున్నా బలవంతాన ఆపుకున్నాను.

నా అంచనా తప్పలేదు.

అర్ధరాత్రి, నిన్నటిలానే నిశ్శబ్ద రోదన.

కా స్సేపటికి మాకుగారి తలుపులు కిర్రుమ




న్న చప్పుడు-బరువుగా మెట్లు దిగుతున్న అడుగుల సద్దు.

భార్గవి ఇవేం గమనించలేదు.

అయిదు నిమిషాలు పోనిచ్చి భార్గవిని బయల్దేరదీశాను.

"ఎక్కడికి?" అంది అయోమయంగా.

"తెరతీయని నాటకాన్ని చూపిస్తాను, పద" అన్నాను.

భార్గవి కుతూహలంతో నెమ్మదిగా నా వెనుక నడిచింది.

మాకుగారి గొంతు స్పష్టంగా వినిపిస్తోంది. "నా పెద్దరికం పట్ల నమ్మకం లేనట్లు ఎందుకలా బాధ పడ్తావ్? చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేశాను. ఈ విషయం నలుగురికీ తెలియజేసే రోజు ఇంకెంతో దూరంలో లేదు."

జవాబుగా ఆమె ఏడుపు.

"ఆ రోజు కోసం నీ కంటే నేనే ఎక్కువగా ఎదురు చూస్తున్నాను. ఇంట్లో అమ్మాయి, అల్లుడుగారు ఉన్నారు. ఏడిస్తే బాగుండదు."

భార్గవిని జబ్బ పట్టుకుని మేడమీదికి నడిపించాను.

ట్రాన్స్‌లో పడ్డట్టు నన్ననుసరించింది.

మాగది తలుపులు చేరవేసిన ఆమె కేసి చూసి విజయపూర్వకంగా నవ్వాను.

భార్గవి మొహంలో ఏం మార్పు లేదు.

"ఎప్పుడో పెళ్ళికి ముందు పరిచయమున్నందుకు వాళ్ళు నాతో మాట్లాడితేనే నిలదీసినదానివి ఇప్పుడు మీ ఇంట్లో జరుగుతున్న దొంగాటకానికి ఏం సంజాయిషీ ఇస్తావ్?"

భార్గవి ఏదో ఆలోచిస్తూంది.

"అకాలంలో కోకిల కూయడం అసహజంగా, అసహ్యంగా ఉంటుంది కదూ!" చెప్పి పాడిచాను.

"మీ రంటున్న దేమిటో అర్థం కావడం లేదు నాకు."

"అవును. ఎందుకర్థమవుతుంది? నాటకంలో ప్రధాన పాత్రధారి మీ నాన్నే అయినపుడు, ఆ తండ్రికి నువ్వు కూతురివే అయినపుడు అర్థం కాకపోవడమే మంచిది."

భార్గవి నొసలు ముడిపడ్డాయి. కళ్ళు కెంపుల్లా ఎర్రబారాయి.

"ఛీ, ఛీ... ఏం మనుషులు మీరు? ఎంత సంస్కారహీనంగా ఆలోచిస్తున్నారు! దేవుడిలాటి మా నాన్నని తప్పు బడుతున్నారంటే..."

దొరికిన అవకాశాన్ని వదలాలనిపించలేదు.

"మా నాన్న దేవుడు; నేనే రాక్షసుణ్ణి! ఈ వయస్సులో పెద్దాయన కిదేం పాడుబుద్ధి? అంతగా ఆడది కావల్సివస్తే ఎప్పుడో పెళ్ళి చేసుకోవాల్సింది. ఈ చాటుమాటు వ్యవహారాలంటే అసహ్యం నాకు" అన్నాను విసురుగా.

భార్గవి ఎర్రగా చూసింది నన్ను. ఆమె మొహం జేవురించింది. అదిమి పట్టలేని ఉద్వేగంతో గొంతు విడలేదు రెండు క్షణాలు.

తరవాత—

గంగా ప్రవాహంలా, శరపరంపరలా విజృంభించింది.

"మీ మనస్సులో ఎంత కుళ్ళు పేరుకుపోయిందో అర్థమవుతూంది. చెడే వయస్సున్న మగవాడిని రక్షించుకోవటం తల్లైనా, భార్యైనా ఆ బాధ్యత ఆడదానిదే. నేను మిమ్మల్ని కంట్రోల్ చేసినందుకు మనస్సులోనే కుళ్ళిపోతున్నారు మీరు. దానికి బదులుగా ఈ రోజు మా నాన్న మీద బురద చల్లుదామని చూస్తున్నారు. కానీ నాన్నది చెరిగిపోయిన వయస్సు-చెడే వయస్సు ఎంత మాత్రం కాదు."

"అవున్లే, వయస్సు ముసుగులో ఎంత నేరమైనా చేయచ్చని మీ నాన్న రుజువు చేశారు. నువ్వు చెప్పినదంతా విని నమ్మడానికి నేనేం వెర్రివాడిని కాను. మీ నాన్న నువ్వన్నట్టు నిజంగా ఏ కల్మషమూ లేని మనిషైతే ఈ అర్ధరాత్రి నాటకాలేమిటి? ఆమె ఏడుపులేమిటి! మీ నాన్న ఓదార్పులేమిటి? నీ కింకో విషయం తెలియదేమో! ఆమె గర్భవతి!"

త్రుళ్ళిపడ్డట్టు చూసింది భార్గవి. పేలవంగా నవ్వింది.

"అవును. ఈ విషయాలన్నీ కష్టపడి కనుక్కున్నారు. చూసినదానికి మరింత ఊహించుకుంటూ నాన్నను అపార్థం చేసుకున్నారు. కానీ,నాన్న మీ రనుకున్నంత నీచ స్థితికి దిగజారలేదు. దిగజారబోయే ఒక జీవితాన్ని తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తున్నారు."

"ఇదంతా నన్ను నమ్మమంటావ్!" వెకిలిగా నవ్వాను.

"నమ్మక్కర్లేదు. నిజం తెలుసుకోమంటున్నాను" ఆమె మావంటలక్క కూతురు జానకి.

సంవత్సరాని కోసారి చుట్టపుచూపుగా వచ్చే మా అన్నయ్య వాను మీ లానే మగబుద్ధి పోనిచ్చుకోక ఆమెను మభ్యపెట్టాడు. మోజు తీర్చుకుని వెళ్ళిపోయాడు. ప్రకృతికికూడా ఆడదంటేనే అలుసు. తప్పు చేసిన దిద్దరూ అయినా శిక్ష మాత్రం ఆడదానికే. ఫలితం-అవివాహితగానే ఆమె గర్భవతి.

ఈ నిజాన్ని నిరూపించుకునేందుకు ఆమెకు రుజువులు లేవు-సాక్ష్యాలు లేవు. తన జీవితం ఎలాటి సుడిగుండాల్లో చిక్కుకుందో తెలుసుకున్నాక నగటు ఆడదానిలానే ఆత్మహత్య తలపెట్టింది.

అప్పుడు నాన్నగారి కీ విషయం తెలిసింది. చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న ఆమెను ఇంటికి తీసుకొచ్చారు.

తప్పు చేసిన దెవరైనా న్యాయం ముందు అందరూ తల వంచాల్సిందే ననుకునే నాన్న, వానుకి నాలుగు రోజుల క్రితం ఫోన్ చేసి చివాట్లేసేరు. సెలవు పెట్టి బయలుదేరి రమ్మని చెప్పేరు. వాడికి మరో పదిహేను రోజుల వరకూ సెలవు దొరకదని తెలిసింది."

ఆమె చెప్పినది విని బుర్ర గిర్రున తిరిగింది.

"అంటే?"

"అవును. జానకి ఈ ఇంటి కోడలవుతుంది. అన్నయ్యా చేసిన తప్పుని జీవితాంతం అతనికి గుర్తుండేలా చేయబోతున్నారు నాన్నగారు."

మరో మాట అడగడానికి సిగ్గువేసింది-కించిత్ భయంకూడాను!

భార్గవికి బుద్ధి చెప్పే మరే ప్రయత్నమూ తలపెట్టకూడదనే నిర్ణయాని కొచ్చి వెంటనే దీపం ఆర్పివేశాను.